
సాక్షి
ఖమ్మం
శనివారం : 20 : ఏప్రిల్ : 2024



.. ఫిర్యాదు చేయండి

ఎన్నికల వేళ అక్రమాలపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ – విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 8లో



ఎన్‌ఎస్‌జీ భద్రత నడుమ..

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఖమ్మం పర్యటన ఆద్యంతం ఎన్‌ఎస్‌జీ కమాండర్ల నిఘా నీడలో సాగింది. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం కూడా ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పలుచోట్ల వడగాలులు సైతం వీస్తాయి.

న్యూస్‌రీల్

ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో జేఎన్‌టీయూ నుంచి వచ్చిన బృందాలు శుక్రవారం తనిఖీ చేశాయి. 2024–25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్న నేపథ్యాన ఆయా కళాశాలల్లో సౌకర్యాలపై బృందం సభ్యులు వివరాలు సేకరించారు. కళాశాలల్లో కోర్సులు, అధ్యాపకుల అర్హతలు, ఇతర అంశాలపై ఆరా తీశారు. వీటి ఆధారంగానే వచ్చే విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు అనుమతులు జారీ చేసే అవకాశముంది.

రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

వేంసూరు/తల్లాడ: యాసంగిలో ధాన్యం సాగు చేసిన రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. వేంసూరు మండలం మర్లపాడు, భీరపల్లి, కుంచపర్తి పోలింగ్ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఇదేక్రమంలో వేంసూరు, మర్లపాడులో ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. ఎండ కారణంగా కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సమకూర్చాలని తెలిపారు. రైతులు వేచి ఉండకుండా కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. అలాగే, తల్లాడ మండలం రంగంబంజర, రేజర్లల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన స్కూళ్లతో పాటు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. తహసీల్దార్లు ఎం.ఏ.రాజు, రవికుమార్, ఆర్‌ఐలు చిరంజీవి, భాస్కర్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసం విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్‌ఈ సురేందర్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కాక సంస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ఖమ్మంలోని విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఈ శిక్షణ మొదలైంది. జిల్లాలోని 426 మంది ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ సిబ్బందిలో రోజుకు 50 మందికి చొప్పున వచ్చే నెల 7వరకు శిక్షణ కొనసాగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును చక్కదిద్దడం, అక్రమ కనెక్షన్లను అరికట్టడం, గృహజ్యోతిపై అవగాహన కల్పించడంతో పాటు బకాయిలు వసూలు చేయడమే కాక విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారుల్లో అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తున్నారు. తొలి రోజు శిక్షణను ఖమ్మం ఎస్‌ఈ సురేందర్ ప్రారంభించి మాట్లాడారు. డీఈలు బాబూ రావు, నంబూరి రామారావు, నాగేశ్వరరావు, రాములు, కృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

26వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు వచ్చే నెల 24న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ బి.నాగమునినాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, రూ.100 జరిమానాతో 24వ తేదీ వరకు, రూ.300 అపరాధ రుసుముతో ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందని తెలిపారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

భద్రాచలంటౌన్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు తిరిగి ప్రారంభించే నాటికి మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో పనికి రాని వస్తువులు ఉంటే సబ్ డివిజన్ కమిటీ ద్వారా పరిశీలించి తొలగించాలన్నారు. ప్రత్యేక అధికారులు పాఠశాలలకు రంగులు వేయించడమే కాక ఇతర మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు తప్పనిసరిగా వేసవి సెలవుల్లో పాఠశాలలను సందర్శించాలని తెలిపారు. ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, సురేష్‌బాబు, అశోక్‌కుమార్, భాస్కరన్, హరికృష్ణ పాల్గొన్నారు.

అవి అవినీతి ప్రభుత్వాలు..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండింటి తీరు అదే..

- కేంద్రంలో పదేళ్లు మోదీది నీతివంతమైన పాలన
- తెలంగాణ సాధనలో బీజేపీ పాత్ర మరువలేనిది
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్





ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు, ప్రజలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పక్కన అభ్యర్థి వినోద్‌రావు, నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, ధర్మారావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర మరువలేనిది. రాష్ట్రం ఏర్పడితే నీతివంతమైన పాలన అందుతుందని ప్రజలు ఆశించారు. కానీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిమయంగా మారాయి. బీఆర్‌ఎస్ ప్రజలను దోచుకుంటే ప్రజలు ఆ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో తరిమికొట్టారు. కాంగ్రెస్ సైతం ఇదే రీతిలో ముందుకు వెళ్తోంది.' అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరోపించారు. ఖమ్మంలో శుక్రవారం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ దాఖలు చేయగా.. ఆయన విజయాన్ని కాంక్షిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి జెడ్పీ సెంటర్‌లో ప్రసంగించారు. దేశంలో కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలు జరగగా.. పదేళ్లుగా నరేంద్రమోదీ పాలన మాత్రం అవినీతికి ఆస్కారం లేకుండా సాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పేదరికం నిర్మూలిస్తామని చెప్పారే తప్ప చేయలేదని, మోదీ ప్రభుత్వంలో 25 కోట్ల మంది నిరుపేదలను ఉన్నత స్థానానికి చేర్చామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా దేశంలో లక్షలాది మందికి ఉచితంగా రూ.5లక్షల వరకు ఆరోగ్య చికిత్స అందించే అవకాశం మోదీ ప్రభుత్వం కల్పించిందన్నారు. కాగా, నీతివంతుడైన, డైనమిక్ లీడర్ వినోద్‌రావును ఖమ్మం ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఆపై తాను సైతం ఖమ్మం వచ్చి ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సేవా రంగంలో వినోద్‌రావు అంకిత భావం తిరుగులేనిదని అభినందించారు. కాగా, కేంద్ర మంత్రి ప్రసంగిస్తున్నంత సేపు జై శ్రీరామ్, జై భారత్, జై మోదీ నినాదాలు మిన్నంటాయి.

కమలం.. కదనోత్సాహం

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంలో కాషాయ శ్రేణులు కదం తొక్కాయి. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు శుక్రవారం పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరు కాగా.. ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. సర్దార్ పటేల్ స్టేడియం వద్ద మొదలైన ర్యాలీ జెడ్పీ సెంటర్, వైరా రోడ్, పాత బస్టాండ్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్‌కు చేరింది. ర్యాలీలో మహిళల కోలాట నృత్యాలు, గిరిజన మహిళలు బిందెల ప్రదర్శన, బోనాలు ఆకట్టుకున్నారు. అలాగే ఆదివాసీ కళాకారులు డప్పు, కొమ్ము నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ప్లకార్డులను ప్రదర్శించారు. అలాగే, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కాగా, సర్దార్ పటేల్ స్టేడియానికి హెలీకాప్టర్ చేరుకున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, నాయకులు స్వాగతం పలికారు.

ఖమ్మంలో గెలుస్తున్నాం

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం మామిళ్లగూడెం: లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి గెలవడం ఖాయమని బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశాక మీడియా పాయింట్‌లో, ఆతర్వాత ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా 400పై చిలుకు స్థానాల్లో గెలవనుండగా, ఆ జాబితాలో ఖమ్మం కూడా ఉంటుందని తెలిపారు. టికెట్ ఆశించిన నిరాశకు లోనైన వారు సైతం సహకరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక హామీలను విస్మరించడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని తెలిపారు. ఇక బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, ఆరోపణల నేపథ్యాన ఎమ్మెల్సీ జైలుకి వెళ్లారని చెప్పారు. ప్రజలు ఆలోచన చేసి బీజేపీ గోల్డెన్ ప్రభుత్వం కావాలా, కాంగ్రెస్ రోల్డ్ గోల్డ్ కావాలో తేల్చుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం తనను గెలిపించాలని వినోద్‌రావు పిలుపునిచ్చారు. దేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ప్రధాని మోదీ అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణతో పాటు శ్రీకాంత్, శీలం పాపారావు, గోంగూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నామినేషన్ దాఖలు చేసిన 'తాండ్ర'

- ఆస్తులు రూ.11.65కోట్లు.. అప్పులు రూ.3.42లక్షలు



రిటర్నింగ్ అధికారి గౌతమ్‌కు నామినేషన్ సమర్పిస్తున్న తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం సహకారనగర్: బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వీ.పీ.గౌతమ్‌కు శుక్రవారం ఒక సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా, తొలిరోజైన గురువారం ఒకే నామినేషన్ దాఖలు కాగా.. శుక్రవారం సైతం ఒకటే నామినేషన్ వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేటకు చెందిన వినోద్‌రావు నామినేషన్ వెంట ఆస్తులు, అప్పులతో కూడిన అఫిడవిట్ సమర్పించారు. ఆయన పేరిట రూ.7,04,45,806 విలువైన చరాస్తులు, రూ.4,61,82,290 విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా బ్యాంకుల్లో రూ.3,42,292 రుణం ఉందని తెలిపారు. ఇక వినోద్‌రావు భార్య వినీల పేరిట రూ.2,90,77,174 విలువైన చరాస్తులు, రూ.1,68,53,662 స్థిరాస్తులు ఉన్నాయని వెల్లడించారు.

కీలకంగా వ్యయ వివరాల పరిశీలన

- ప్రతీ ఖర్చును నమోదు చేయాలి
- వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర్‌నంద్



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రా, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి పోలింగ్ జరిగే వరకు చేసే ప్రతీ ఖర్చును వ్యయ పరిశీలన బృందాలు నిశితంగా పరిశీలిస్తూ నమోదు చేయాలని ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర్‌నంద్ మిశ్రా సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్‌తో కలిసి నిఘా బృందాలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని బృందాలు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభాల రహిత ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. బ్యాంకు ఖాతాలతో పాటు డిజిటల్ లావాదేవీలు, అనుమానాస్పద లావాదేవీలను తనిఖీ చేయాలని, ర్యాలీలు, సమావేశాలే జరిగినప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయించిన ధర ప్రకారం ఖర్చులు నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్, 45 ఎస్‌ఎస్‌టీ బృందాల ద్వారా నిఘా ఏర్పాటుచేశామని తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఇప్పటివరకు అందిన 155 దరఖాస్తుల్లో 109 పరిష్కరించగా 22 తిరస్కరించామని చెప్పారు. మిగతావి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 12 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులద్వారా తనిఖీలు ముమ్మరం చేశామని వెల్లడించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, మాస్టర్ ట్రెయినీ కె.శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్..



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ, పక్కన ఎంపీ అభ్యర్థి నామ, ఎమ్మెల్సీ మధు, తదితరులు

- ఉద్యమం, అభివృద్ధిలో ఎక్కడ ఉన్నారో చెప్పాలి
- బీఆర్‌ఎస్ సమావేశంలో పువ్వాడ, నామ, తాతా మధు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. కొన్నాళ్లకే ఆ పార్టీ తీరు ప్రజలకు అర్థమైపోయిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం లోక్‌సభ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కాగా, ఒకప్పుడు బీఆర్‌ఎస్‌ది కుటుంబ పాలన అంటూ మాట్లాడిన నాయకులు, కొందరు మంత్రులు ఇప్పుడు ఎంపీ టికెట్ తమ కుటుంబానికే కావాలనే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, ఆయన కుటుంబం తెలంగాణ ఉద్యమంలో పాల్గొని, తెలంగాణ అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఉద్యమం, అభివృద్ధిలో ఎక్కడ ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రతికూల వాతావరణం వచ్చినా... లోక్‌సభ ఎన్నికల్లో నామను గెలిపించుకోవాలని కోరారు. ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీసారి ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించడానికి నాయకులు, కార్యకర్తల శ్రమే కారణమని తెలిపారు. పార్టీ తరఫున ప్రతీ ఓటర్‌ను కలిసి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ చేస్తున్న మోసాలను వివరించాలని కోరారు. పార్లమెంటరీ నాయకుడిగా రాష్ట్ర నిధులు, విభజన హామీల కోసం గళం విప్పానని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారని అన్నారు. గత తొమ్మిదేళ్లల్లో చూడని నీటి ఎద్దడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చిందని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర, రఘునాథపాలెం మండల అధ్యక్షులు పగడాల నాగరాజు, వీరూనాయక్‌తో పాటు బచ్చు విజయ్‌కుమార్, మెంతుల శ్రీశైలం, తాళ్లూరి జీవన్‌కుమార్, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, తాజుద్దీన్, కర్నాటి కృష్ణ, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి పనుల్లో వేగం..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: మున్నేరు నదిపై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఖమ్మంలో శుక్రవారం తనను కలిసిన వారికి సూచనలు చేశారు. వర్షాకాలం రాకముందే కాంక్రీట్ పనులు ముగించాలని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి వద్ద నీటి నిల్వ కోసం నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయంతో చెక్‌డ్యాం నిర్మించాలని, తద్వారా భూగర్భజలాలు పెరిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇదేసమయాన పాత బ్రిడ్జిని కూడా తీర్చిదిద్ది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. పనులు జరిగే సమయాన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని, మున్నేరుకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణ సంస్థ ప్రతినిధులతోనూ సమన్వయం చేసుకోవాలని మంత్రి తెలిపారు.

ఈద్ మిలాప్‌లో పాల్గొన్న మంత్రి



ఈద్ మిలాప్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఈద్ మిలాప్‌నకు హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల యలగొండలస్వామి, పుచ్చకాయల వీరభద్రం, మహ్మద్ ఆశిఫ్, మైనార్టీ పెద్దలు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చిల్డ్‌గా చీర్స్ !

జిల్లాలో జోరుగా బీర్ల అమ్మకం

- నాలుగు నెలల్లో రూ.104 కోట్ల మేర విక్రయాలు
- గత ఏడాదితో పోలిస్తే అదనంగా రూ.20కోట్లు
- ఎండవేడితో పెరుగుతున్న గిరాకీ

వైరా: ఎండల రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఏ రోజు కూడా 40 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఈ నేపథ్యాన ప్రజలు వేసవి తాపం నుంచి సేద తీరేందుకు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, చెరువు రసం వంటి వాటిని ఆశ్రయిస్తున్నారు. ఇదేసమయాన మందుబాబులు మాత్రం బీర్లపైనే మక్కువ చూపుతున్నారు. జనవరి 1వ తేదీ నుంచి నుంచి ఈనెల 17వ తేదీ వరకు వైరాలోని ఐఎంఎఫ్‌ఎల్ డిపో నుంచి ఉమ్మడి జిల్లాలోని బార్లు, వైన్స్ యజమానులు 9,16,553 కేసుల మద్యం తీసుకెళ్లగా... 6,05,844 కేసుల బీర్లు తీసుకెళ్లడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఉష్ణోగ్రతలతో పాటే అమ్మకాలు

ఏ రోజుకారోజు ఎండలు పెరుగుతుండడంతో అదే స్థాయిలో బీర్ల అమ్మకం జోరందుకుంటోంది. రానున్న కాలంలో అమ్మకాలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీంతో డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరాకు ఇబ్బంది లేకుండా ఐఎంఎఫ్‌ఎల్ డిపో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 210 వైన్స్, 50 బారులు, మూడు క్లబ్‌లు ఉన్నాయి. అనధికారికంగా వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. వీటన్నింటికీ వైరాలోని నుంచి డిపో నుంచే మద్యం సరఫరా అవుతోంది. ఈ నేపథ్యాన జనవరి 1నుంచి ఇప్పటివరకు రూ.104కోట్ల విలువైన బీర్ల (6,05,844కేసులు)ను వైన్స్, బార్ల యజమానులు తీసుకెళ్లారు. గత ఏడాది ఇదే సమయాన రూ.84 కోట్ల విలువైన 4,98,345 కేసుల బీర్లు మాత్రమే తీసుకెళ్లినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంటే గతేడాదితో పోలిస్తే రూ.20కోట్ల మేర ఎక్కువ విలువైన బార్లను తీసుకెళ్లడంతో గిరాకీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.



ఇదే అదునుగా..

బార్లు, వైన్స్‌ల్లో పగలు, రాత్రి తేడా లేకుండా మద్యంతో పోలిస్తే బీర్ల అమ్మకాలే ఎక్కువగా సాగుతున్నాయని చెబుతున్నారు. ఇదే అదునుగా కొన్నిచోట్ల వైన్స్ యజమానులు సిండకేట్‌గా మారి బీర్ల ఎమ్మార్పీ రూ.10నుంచి రూ.20వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలుకావడంతో గిరాకీ జోరందుకుంటోంది. ప్రచారంలో పాల్గొన్న వారు వయస్సు తేడా లేకుండా బీర్లనే ఆశిస్తున్నట్లు నాయకుల ద్వారా తెలుస్తోంది. ఈ కారణంగా కొన్ని చోట్ల బీర్లకు కొరత ఏర్పడగా.. ఇంకొన్ని చోట్ల వైన్స్ యజమానులు కృత్రిమ కొరత సృష్టించి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈవిషయమై ఇప్పటివరకు ఎక్సైజ్ అధికారులు మాత్రం స్పందించడం లేదు. కానీ రానురాను ఎండలు మరింత పెరిగి బీర్లకు డిమాండ్ పెరగనున్నందున ధరల కట్టడిపై దృష్టి సారించాలని మందుబాబులు కోరుతున్నారు.

ఉమ్మడి జిలాల్లో బీర్ల అమ్మకం

నెల	గత ఏడాది కేసులు	గత ఏడాది విలువ (రూ.కోట్లలో)	ఈ ఏడాది కేసులు	ఈ ఏడాది విలువ (రూ.కోట్లలో)
జనవరి	1,13,829	19	1,41,615	24
ఫిబ్రవరి	1,43,583	25	1,71,673	30
మార్చి	1,76,963	30	1,86,123	32
ఏప్రిల్	63,970	10	1,06,433	19
మొత్తం	4,98,345	84	6,05,844	104

మానుకోట కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నామినేషన్..



ఆర్‌ఓ అద్వైత్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్, పక్కన ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామచంద్రునాయక్, కోరం కనకయ్య

మహబూబాబాద్: మహబూబాబాద్ లోక్‌సభ స్థానానికి రెండో రోజు శుక్రవారం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ములుగు జిల్లా మదనపల్లికి చెందిన పోరిక బలరాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు సమర్పించారు. పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వంచ దుర్గ, నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్‌నాయక్ స్వతంత్ర అభ్యర్థులుగా, వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండకు చెందిన జాటోత్ రఘునాయక్ ఆధార్ పార్టీ నుంచి నామినేషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా

ప్రారంభమైన బొమ్మ ప్రీమియర్ లీగ్



ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న హన్మంతరెడ్డి, రాజేశ్వరరావు, సత్యప్రసాద్ తదితరులు

ఖమ్మం అర్బన్: నగరంలోని బొమ్మ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల్లో బొమ్మ ప్రీమియర్ లీగ్–2024 శుక్రవారం ప్రారంభమైంది. ఈమేరకు జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్‌ను యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్, రీజినల్ హెడ్ ఏ.హన్మంతరెడ్డి, బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావం, పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు సొంతమవుతాయని తెలిపారు. విద్యార్థులు ఈవెంట్లలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా.. అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

26 నుంచి రెండు జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు

తల్లాడ: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు తల్లాడ మండలం అన్నారుగూడెం మహాలక్ష్మి కమిటీ బాధ్యులు తెలిపారు. అన్నారుగూడెంలో సూపర్ లీగ్ పద్ధతిలో పోటీలు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాజట్లు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు 99895 30975, 77806 50748 నంబర్లలో సంప్రదించలని సూచించారు.

నామినేషన్ ఫీజు అందజేసిన విఠల్‌రావు



బలరామ్‌కు నగదు అందజేస్తున్న విఠల్‌రావు

కామేపల్లి: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ ఫీజు రూ.12,500ను కామేపల్లి మండలానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు బోడేపూడి విఠల్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని రాపర్తినగర్ బైపాస్‌రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాఠశాల విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పింది. బైపాస్‌పై వెళ్తున్న లారీ అదుపు తప్పి ముందు ఉన్న కారును ఢీకొట్టడంతో ఆ కారు కరెంట్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఆపై లారీ ముందు వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును సైతం ఢీకొట్టింది. ఆ సమయాన బస్సులో వెనక భాగాన పిల్లలెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే, ఒక్కసారే కుదుపు రావడంతో ఓ విద్యార్థికి సీటు గుద్దుకుని పెదవికి గాయమైంది. విషయం తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు చేరకుని పిల్ల లను తీసుకెళ్లారు. అలాగే, ఖమ్మం టూటౌన్ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి, సీతానగరాల్లో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐలు కేశవరావు, గణేశ్ శుక్రవారం తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య తన సిబ్బందితో పెద్దనల్లబల్లి, సీతానగరం సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈక్రమంలో పెద్దనల్లబల్లి సెంటర్‌లో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 40 లీటర్ల నాటుసారా లభ్యం కావడంతో వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే, సీతానగరం సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 40లీటర్ల నాటుసారా లభ్యం కావడంతో వారిని కూడా స్టేషన్‌కు తరలించి విచారించగా సుజ్ఞానపురంనికి చెందిన నాగేశ్వరరావు, శ్రీకాంత్, భూక్యా బాబూరావు, భూక్యా సాంబగా తేలింది. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐలు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,155	1.850
పెసలు	8,500	5,500
కందులు	10,700	8,000
బొబ్బెర్లు	7,600	7,600
మిర్చి	19,500	9,600
మిర్చి తాలు	9,500	5,400
పత్తి	7,150	5,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

అక్రమమా.. ఫిర్యాదు చేయండి

- సీ – విజిల్‌'తో సులువు, పారదర్శకత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఎన్నికల వేళ తాయిలాలు సర్వసాధారణమయ్యాయి. అయితే, వీటిపై ఇన్నాళ్లు నేరుగా మాత్రమే ఫిర్యాదు చేయడానికి అవకాశముండేది. దీంతో నాయకులు, అభ్యర్థులపై భయం కారణంగా చాలామంది ఫిర్యాదుకు ముందుకొచ్చే వారు కాదు. ఈ నేపథ్యాన ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా.. ఎక్కడైనా అక్రమాలకు పాల్పడినట్లు తెలిసినా, బహుమతులు దాచినట్లు గుర్తించినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ఫొటోలు, వీడియోలు ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేస్తే అధికారులు తక్షణమే రంగంలోకి దిగి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. ఈక్రమంలో ఎక్కడ కూడా ఫిర్యాదుదారుల పేరు, వివరాలు బయటకు వచ్చే అవకాశం లేనందున నిర్భయంగా ముందుకు రావాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. – ఖమ్మం సహకారనగర్

వంద నిమిషాల్లోనే చర్యలు..

ఎక్కడైనా మద్యం, డబ్బు, ఇతర సామాగ్రి ద్వారా ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిసినా, ఇతర అంశాలపైనా ఫిర్యాదు చేయొచ్చు. ఈ మేరకు యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు అందిన 100నిమిషాల్లోగా ఘటనా స్థలికి చేరుకుని చర్యలు తీసుకుంటారు. ఆపై ఏం చర్యలు తీసుకున్నారనే అంశం కూడా ఫిర్యాదుదారుడికి చేరవేస్తారు. ఇక సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని అధికార యంత్రాంగం చెబుతోంది.

డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న వారెవరైనా ప్లే స్టోర్ నుంచి సీ–విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. అనంతరం ఫొటో, వీడియో, ఆడియో మూడు రకాల ఆప్షన్లు వస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడి పరిస్థితుల ఆధారంగా ఎంపిక చేసుకుని ప్రొసీడ్ కొట్టాలి. ఆపై ఫిర్యాదు నేరుగా సంబంధిత అధికారులకు చేరుతుంది.

కంట్రోల్ రూం నుంచి..

సీ–విజిల్‌కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా కంట్రోల్ రూమ్ సిబ్బంది ఘటనాస్థలికి సమీపాన ఉన్న అధికారుల బృందానికి సమాచారం చేరవేస్తారు. ఆ వెంటనే అధికారుల బృందం అక్కడకు వెళ్లి ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తుంది. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, ఇతర అధికారులకు వెల్లడిస్తే.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.

అసెంబ్లీ నుంచి అధికంగా..

గత అసెంబ్లీ ఎన్నికల నుంచి సీ–విజిల్ యాప్‌పై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రలోభాలకు చెక్ పెట్టాలంటే ఈ యాప్ బాగా ఉపయోగపడుతుందని చెబుతూ ప్రజల్లోకి వెళ్లేలా ప్రచారం చేశారు. అలాగే, కళాశాలల్లో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించగా.. ఎక్కువ మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా కృషిచేస్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన మళ్లీ యాప్ ద్వారా ఫిర్యాదుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పిస్తున్న నేపథ్యాన మంచి ఫలితాలు వస్తాయనే భావన వ్యక్తమవుతోంది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

సువిధ.. సులువుగా..!



లోక్‌సభ(పార్లమెంట్) ఎన్నికల సమరం ఊపందుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కాగా, ఇప్పుడిప్పుడే నామినేషన్లు దాఖలవుతున్నాయి. ఈనేపథ్యాన బరిలోకి దిగే అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన పారదర్శకతతో పాటు అభ్యర్థులకు సులువయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం 'సువిధ' పేరిట యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే యాప్‌ను వినియోగించేలా రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు అవగాహన కల్పించారు. యాప్ ద్వారా దరఖాస్తులు, అనుమతుల జారీ వల్ల అంతా సాఫీగా సాగుతుందని అధికార యంత్రాంగం చెబుతోంది. – ఖమ్మం సహకారనగర్

- ఎన్నికల వేళ ఆన్‌లైన్‌లో అనుమతులు
- సభలు, సమావేశాల నిర్వహణకు యాప్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ.. ఆపై అనుమతుల జారీ

● 48 గంటలకు ముందు దరఖాస్తు

ఎన్నికల సమయంలో అభ్యర్థులు, పార్టీల నాయకులకు ప్రతీ నిమిషం విలువైనదనే చెప్పాలి. ఈమేరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహణ కోసం నిర్ణీత తేదీకి 48గంటల ముందు సువిధ యాప్ ద్వారా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కడ సభ నిర్వహించనున్నారు, ర్యాలీ అయితే ఎక్కడి నుంచి ఎక్కడి వరకు సాగుతుంది.. ఎన్నివాహనాలు పాల్గొంటాయి తదితర అంశాలతో సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై అధికారులు అన్ని వివరాలు పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.

● ఎక్కడికక్కడే అనుమతి

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ మేరకు సువిధ యాప్ ద్వారా అందే దరఖాస్తులను సభ, ర్యాలీ జరిగే ప్రాంతం ఆధారంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అనుమతి ఇస్తారు.

● మొదటి దరఖాస్తుకే ప్రాధాన్యత

సభలు, సమావేశాల నిర్వహణకు ఒకటి కంటే ఎక్కువ పార్టీల ఒకే మైదానాన్ని ఎంచుకుంటే మొదటి అందిన దరఖాస్తుకే అధికారులు ప్రాధాన్యత ఇస్తారు. గెస్ట్ హౌస్‌ల విషయంలోనూ ఇదే నిబంధన పాటిస్తారు. ఇదిలా ఉండగా గురువారం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా బీజేపీ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. మిగతా పార్టీల నామినేషన్లు, సభలు మొదలు కానుండడంతో అదే స్థాయిలో సువిధ యాప్ ద్వారా దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని భావిస్తున్నారు.

ఎన్‌ఎస్‌జీ భద్రత నడుమ రక్షణ మంత్రి పర్యటన

ఖమ్మంక్రైం: ఎన్‌ఎస్‌జీ(నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్) భద్రత నడుమ శుక్రవారం ఖమ్మంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన కొనసాగింది. జిల్లాలో రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన ఖరారు కాగానే మూడు రోజుల క్రితమే భద్రతా సిబ్బంది 30మంది ఇక్కడకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతలో ఉన్న నేపథ్యాన రోడ్ షో ఆసాంతం ఎన్‌ఎస్‌జీ కమాండర్లు వలయంగా ఏర్పడి విధులు నిర్వర్తించారు. అంతేకాక సీపీ సునీల్‌దత్ ఆదేశాలతో నగర ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యాన జిల్లా పోలీసులు 500మంది బందోబస్తులో పాల్గొన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా కొద్దిసేపు మయూరిసెంటర్ ఫ్లై ఓవర్‌పై వాహనాల రాకపోకలు నిలిపివేయడమే కాక పాత బస్టాండ్‌కు రావాల్సిన వచ్చే పల్లెవెలుగు బస్సులను కొత్త బస్టాండ్‌కు మళ్లించారు.



కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన సందర్భంగా గస్తీలో పోలీసులు





బైనాక్యులర్ ద్వారా పరిశీలిస్తున్న పోలీసు, విధుల్లో కమాండర్

ఆకట్టుకున్న 'పోతరాజులు'



బీజేపీ ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున నిర్వహించిన ప్రచార ర్యాలీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో హైదరాబాద్ నుంచి మరుగుజ్జులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పోతరాజుల వేషధారణలో నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాలి

మధిర: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి నీలోహన సూచించారు. మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీని శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, మందుల లభ్యత, ఓపీ రికార్డులను తనిఖీ చేసి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆతర్వాత మడుపల్లి బస్తీ దవాఖానాను కూడా వారు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న అధికారులు

రూ.10వేల విలువైన మద్యం స్వాధీనం

కల్లూరు: కల్లూరులోని పుల్లయ్యబంజర్ వీధి, పడమటి లోకవరంలోని బెల్ట్ షాప్‌ల్లో ఫ్లెయ్యింగ్ స్క్వాడ్ బృందం అధికారులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లో రూ.10,500 విలువైన మద్యం స్వాధనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు.

అదుపుతప్పి దగ్ధమైన కారు



ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు – తక్కెళ్లపాడు మధ్య శుక్రవారం ప్రమాదవశాత్తు అదుపు తప్పిన కారు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన కొందరు తక్కెళ్లపాడులో జరిగిన వివాహానికి కారులో వచ్చారు. అక్కడి నుంచి బనిగండ్లపాడుకు వెళ్లి తిరిగి తక్కెళ్లపాడు వస్తుండగా బ్రిడ్జి సమీపాన మలుపు వద్ద కారు అదుపు తప్పింది. ఈక్రమంలోనే కారులో మంటలు రావడంతో అందులోని వ్యక్తులు దిగగానే కారు పూర్తిగా కాలిపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లయింది. అయితే, ఈ కారు ఎవరిది, అందులో ఎవరున్నారో తెలియరాలేదు.

రేషన్ బియ్యం స్వాధీనం

మధిరరూరల్: మధిర మండలం మాటూరు క్రాస్ వద్ద శుక్రవారం రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మధిర రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై లక్ష్మీ భార్గవి ఆధ్వర్యాన పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మధిర నుంచి ఆంధ్రా వైపుకు వెళుతున్న రెండు వాహనాలను పరిశీలించారు. అందులో రేషన్ బియ్యం ఉండడంతో వాహనాలను మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వ్యక్తి మృతి.. రెండో రోజు గుర్తింపు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు ఆటోనగర్‌లో నివాసముంటున్న సీహెచ్.సుబ్బారావు (64) మృతి చెందాడు. ఆయన భార్య, కుమారుడు, కూతురు హైదరాబాద్‌లో ఉంటుండగా.. సుబ్బారావు ఒంటరిగా ఆటోనగర్‌లో ఉంటున్నాడు. ఈనెల 17న రాత్రి చివరిసారి కుమారుడితో ఫోన్‌లో మాట్లాడాడు. ఆతర్వాత కుమారుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో శుక్రవారం ఉదయం పక్కింటికి వారికి ఫోన్ చూసి చూడాలని కోరాడు. దీంతో వారు వెళ్లేలోగా దుర్వాసన వస్తుండగా తలుపు తీసి చూడడంతో సుబ్బారావు మృతిచెంది ఉన్నాడు. ఆయన ఈనెల 17న గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

మద్యం మత్తులో డ్రైవర్ బీభత్సం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

సత్తుపల్లిటౌన్: మద్యం మత్తులో ఓ డ్రైవర్ కారు నడిపి బీభత్సం సృష్టించి ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. సదరు వ్యక్తి కారులో వేగంగా వస్తూ పాతసెంటర్‌లో ద్విచక్రవాహనం, ట్రాలీ ఆటోను ఢీకొట్టటాక అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న రామానగరం గ్రామానికి చెందిన యలమర్తి పార్వతికి గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకున్న పోలీసులు మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌ను అదుపులోకి విచారిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని నాగులవంచకు మోత్కూరి వెంకటేశ్వర్లు కానరాకుండా వెళ్లడంతో ఆయన కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మూడు నెలలుగా మతిస్థిమితం సరిగ్గా లేని వెంకటేశ్వర్లు ఈనెల 15వ తేదీన బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఎక్కడ గాలించినా ఆచూకీ తెలియక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

- ఏపీలో భార్య అమ్మమ్మను హత్య చేసిన రామకృష్ణ
- ఆపై స్వగ్రామమైన వైరా మండలం రెబ్బవరానికి చేరిక
- రెండేళ్ల క్రితం తమ్ముడిని సైతం చంపిన వైనం

వైరారూరల్: ఏపీలోని కోనసీమ అంబేద్కర్ జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామంలో భార్య అమ్మమ్మ శిరిగినీడి గంటాలమ్మ(78)ను గొంతు కోసి హతమార్చిన నిందితుడిని ఆయన స్వగ్రామమైన వైరా మండలం రెబ్బవరంలో పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వైరా మండలం రెబ్బవరం మాజీ సర్పంచ్ సాదం రామారావుకు తమ్ముళ్లు రామకృష్ణ, నరేష్ ఉన్నారు. వీరిలో దివ్యాంగుడైన నరేష్ తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో రామకృష్ణ నిత్యం వేధించేవాడు. దీంతో రామకృష్ణ భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఏపీలోని కొత్తపేట మండలం గంటి గ్రామంలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయింది. ఇందుకు నరేషే కారణమని కక్ష పెంచుకున్న రామకృష్ణ ఆయనను 2022 అక్టోబర్ 25న రెబ్బవరంలోని ఇంట్లో హత్య చేశాడు. ఈకేసులో అరెస్ట్ అయిన ఆయన బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఆతర్వాత పెద్దల సమక్షాన భార్యభర్తలు రాజీ పడడంతో ఏపీలోని ఆలమూరు మండలం చెముడులంకలో కాపురం ప్రారంభించారు. కానీ రామకృష్ణ మళ్లీ భార్యను చిత్రహింసలకు గురిచేస్తుండగా ఆయన భార్య తిరిగి గంటి గ్రామానికి వెళ్లిపోయింది.

అనంతరం గతేడాది అక్టోబర్‌లో తన భార్యను కాపురానికి పంపాలని ఆమె అమ్మమ్మ గంటాలమ్మతో ఘర్షణ పడి చంపేస్తానని బెదిరించాడు. దీంతో కొత్తపేట పోలీసులు ఆయనను అరెస్ట్ చేయగా బెయిల్‌పై బయటకు వచ్చిన రామకృష్ణ రెండు రోజుల క్రితం గంటాలమ్మ ఇంటికి వెళ్లి కత్తితో ఆమె పీక కోసి నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆపై భార్యను కూడా చంపుతానని బెదిరించి పారిపోయి స్వగ్రామమైన రెబ్బవరం వచ్చాడు. ఈమేరకు కొత్తపేట పోలీసులు సమాచారంతో వైరా పోలీసులు శుక్రవారం రామకృష్ణను అదుపులోకి తీసుకున్నారు.

వృద్ధురాలి ఇంటికి తాళం

- ఆభరణం విషయంలో గొడవతో తాళం వేసిన చెల్లి
- వత్తాసు పలికిన గ్రామపెద్ద



ఇంటి వరండాలో కూర్చున నాగరత్నమ్మ

కామేపల్లి: ఆభరణం విషయంలో తలెత్తిన వివాదంతో సొంత చెల్లె తన అక్క ఇంటికి తాళం వేయడంతో వారం రోజులుగా ఎండలో ఆరుబయటే జీవనం కొనసాగిస్తోంది. మండలంలోని జాస్తిపల్లికి చెందిన బాధిత వృద్ధురాలు మల్లెంపాటి నాగరత్నమ్మ తెలిపిన వివరాలు..... మల్లెంపాటి నర్సయ్య – నాగరత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె జన్మించగా చిన్న కొడుకు, కుమార్తె మృతి చెందడంతో పోలీసు శాఖలో ఉద్యోగి అయిన పెద్ద కొడుకు మాత్రమే ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో నాగరత్నమ్మ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో ఆమె చెల్లి, గార్ల మండలం ముత్తారపు యశోద కుటుంబ సమస్యల కారణంగా తన బంగారు గొలుసును నాగరత్నమ్మ వద్ద దాచిపెట్టి అప్పుడప్పుడు తీసుకెళ్లేది. గత ఏడాది డిసెంబర్‌లోనూ వచ్చి గొలుసు ఇవ్వాలని అడగగా గతంలోనే తీసుకెళ్లావని నాగరత్నమ్మ చెప్పడంతో గొడవ మొదలైంది. వారం క్రితం యశోద ఆమె కుమారుడితో నాగరత్నమ్మ వెతికాక ఓ గ్రామ పెద్ద చర్చలు జరిపారు. దీంతో నాగరత్నమ్మ రూ.60 వేలు ఇచ్చేందుకు అంగీకరించినా గ్రామపెద్ద రూ.75 వేలు ఇవ్వాలని తేల్చిచెప్పడంతో ఆమె నిరాకరించడంతో బయటకు గెంటేసి ఇంటికి తాళాలు వేశారు. అప్పటి నుంచి నాగరత్నమ్మ చేసేదేం లేక వరండాలో ఎండలోనే ఉంటోంది. ఇదిలా ఉండగా గొలుసు విషయాన్ని నాగరత్నమ్మ కుమారుడికి యశోద ఫోన్ చేయగా తనకు సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం.

కాలి బూడిదైన ద్విచక్రవాహనం

కామేపల్లి: పొలం వద్ద నిలిపిన ద్విచక్రవాహనం కాలి బూడిదైన ఘటన మండలంలోని ముచ్చర్లలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన జాలె శివ మధ్యాహ్నం పొలంలో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పొలం సమీపాన వాహనాన్ని నిలిపి పని ముగించుకుని రెండు గంటల తర్వాత వచ్చేసరికి బండి అగ్నికి కాలిపోయింది. ఎండ కారణంగా ఇలా జరిగిందని బాధితుడు చెబుతుండగా.. సమీపంలో ఎవరైనా చెత్తకు నిప్పు పెడితే మంటలు వ్యాపించి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. ఘటనపై శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



మంటల్లో కాలిపోయిన ద్విచక్రవాహనం

లారీ డ్రైవర్ నిర్లక్ష్యం.. కూలీ మృతి



రాములు (ఫైల్)

ఖమ్మంక్రైం: పనికి వెళ్తున్న కూలీని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఖమ్మం నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంకు చెందిన మెట్టు రాములు(55) తనతోపాటు పనిచేసే సంపత్ ద్విచక్రవాహనం ఎక్కి కూలీ పనులకు బయలుదేరాడు. వీరిద్దరు ఎన్టీఆర్ విగ్రహం వద్ద సిగ్నల్ పడడంతో ఆగగా.. గ్రీన్ సిగ్నల్ పడగానే వెనక ఉన్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా ముందుకొచ్చి ఢీట్టడంతో బైక్‌పై వెనకాల కూర్చున్న రాములు కింద పడ్డాడు. ఆయన పైకి లారీ టైర్లు ఎక్కడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదేఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న సంపత్‌కు సైతం గాయాలయ్యాయి. ఈమేరకు కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

తాటిచెట్టు పైనుండి పడి గీతకార్మికుడు..



వెంకన్న (ఫైల్)

తిరుమలాయపాలెం: తాటిచెట్టు పైనుండి పడడంతో తీవ్ర గాయాల పాలైన గీతకార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతర్లపాడుకు చెందిన మల్లారపు వెంకన్న(63) శుక్రవారం ఉదయం చంద్రుతండాలో తాటిచెట్టు ఎక్కగా ముత్తాదు మోకు ఊడిపోయి పక్కనే ఉన్న వ్యవసాయబావి మోటార్ గుంతలో పడి అక్కడి నుంచి బావిలో పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య నర్సమ్మ, ఇద్దరు పిల్లలు ఉండగా పెద్దదిక్కు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా రోదించారు. కాగా, ఆయన కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించి చేసి ఆదుకోవాలని పలువురు కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

ఖమ్మంక్రైం: కుమార్తెను అల్లుడు కాపురానికి తీసుకెళ్లడం లేదనే మనస్థాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన అప్పికట్ల వెంకటేశ్వర్లు(55) కుమార్తెను గార్ల మండలం పోచారం యువకుడికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆతర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో అల్లుడిపై వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా తన కుమార్తె అల్లుడు తీసుకెళ్లడం లేదనే మనస్థాపంతో ఈనెల 16న పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.